


(గత సంచిక తరువాయి)

**8**

**"హోం మినిష్టరుతానున్నా. ఏంది జల్ది చెప్పు."** అన్నాడు సాంబురెడ్డి.

"మా అన్నతో పెండ్లి ముచ్చట కలిపినా, ఆయనిష్టంగున్నడు. మహేందర్ రెడ్డి మన అల్లుడైనట్టే!" అంది అత్యుత్సాహంతో రాజమ్మ.

"అయితే ఇంకేంది రాజీ! నేన్జూసుకుంటాలే, వాని సంగతి. ఇప్పుడే మినిష్టర్తో మాట్లాడుతున్నా" అంటూ ఫోన్ కట్ చేసాడు సాంబురెడ్డి.

రాజమ్మ గదిలోకి వెళ్ళినంత వేగంగా తిరిగి నర్సిరెడ్డి ఉన్న చోటికి వచ్చింది. "ఆయన హోం మినిష్టరు తానకు పోయిండు అన్నా. అన్నీ మాట్లాడుతుండు."

"నేను సాంబురెడ్డిని నమ్ముచ్చినా, ఆయన ఉపకారం చేస్తడని. మాట నిలబెట్టుకుంటుండు." అన్నాడు సంతోషంగా నర్సిరెడ్డి. "గట్లనే ఆ గణేష్ నాయన్కి జల్దీ పైసలిప్పించే పనిగూడ చూడమని చెప్పు చెల్లమ్మా. గావ్‌ల ఇది మన ఇజ్జత్ నిలవెట్టది."

రాజమ్మ తిరిగి లోపలకు పోయింది. రెండు నిముషాల తరువాత నర్సిరెడ్డి అనుకున్నాడు. 'చెల్లమ్మ చెప్పుంటాది, సాంబు రెడ్డి మినిష్టరుతో మాట్లాడుతా ఉంటడు. పనైపోయే ఉంటాది.'

నర్సిరెడ్డికి చిన్నగా కునుకు పట్టింది. మెలుకువ వచ్చే సరికి మూడు గంటలయింది. వాష్ బేసిన్ దగ్గర మొహం కడుక్కుని వచ్చి హాల్లో సోఫాలో చతికిలపడ్డాడు. రాజమ్మ టీ పట్టుకు వచ్చి తను కూడా కూర్చుని టి.వి.ఆన్ చేసింది. ఫ్లాష్ న్యూస్ అంటూ ఎనౌన్స్‌మెంట్ వచ్చింది, "విద్యార్థులు బే షరతుగా, జరిగిన అనర్థానికి విచారం వ్యక్తం చేస్తూ క్షమార్పణలు కోరారు. ఇరువర్గాల మధ్య రాజీ కుదరడంతో డాక్టర్లు సమ్మె విరమించారు. విద్యార్థులపై కేసును ఉపసంహరించుకున్నారు."

నర్సిరెడ్డి వెంటనే సాంబురెడ్డికి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. వచ్చిన పనయినందుకు సంతోషంగా రాజమ్మతో "పనయింది గదా, వస్తాను చెల్లమ్మ. ఇంటికి పోయి మీ వదినతో కూడా ఒక మాట చెప్పాలిగదా. ఒకసారి హాస్పటలకు పోయి మా ఊరిపోళ్ళను చూసి అట్లనే ఊరుబోతా." అంటూ లేచాడు.

"కారులోపో అన్నా. ఊర్ల నీ పన్జూసుకుని, ఇంటికి పోయినంక కారును పంపించు. ఏంతొందరలే" రాజమ్మ కారు డ్రైవర్ని పిలిచి చెప్పింది. నర్సిరెడ్డి కాదనలేదు.

●●●

నర్సిరెడ్డి పట్నం నుండి తిరిగి వచ్చి వారం రోజులయింది. ఈ వారం రోజుల్లో బందులు, హర్తాళ్ళు అన్నీ రాష్ట్రంలో ముగిసాయి. సర్కారు ఒక మెట్టు దిగొచ్చి స్టూడెంట్ల డిమాండ్లలో కొన్ని అంగీకరించింది, మరికొన్ని పరిశీలనలోకి తీసుకుంది. గణేష్ నాయన యాదగిరికి ఐదు లక్షల పరిహారాన్ని కూడా ప్రకటించింది. చెక్కును ఇవ్వడానికి నియోజక వర్గం ఎం.ఎల్.ఏ, హోం మినిష్టరు గ్రామానికి వచ్చేందుకు ప్రోగ్రామ్ నిర్ణయించారు. ఆ ప్రోగ్రామ్‌లో మరో విశేషం ఉంది. ఎం.ఎల్.ఏ సాంబు రెడ్డి కూతురు సరితకు పటేల్ నర్సిరెడ్డి కొడుకు మహేందర్ రెడ్డికి పెళ్ళి నిశ్చయ తాంబూలాలు కూడా అదే రోజు.

ఉదయం ఎనిమిదిగంటలకే పోలీస్ జీపు వచ్చి నర్సిరెడ్డి ఇంటిముందు వాలింది నర్సిరెడ్డి బయటకు రాగానే ఎస్.ఐ, సెల్యూట్ చేసాడు. "పటేళ్ సాబ్ బాగుండారా. ఉర్ల మీటింగ్ అరేంజ్ మెంట్లు చూస్త ఒక రౌండ్ మీ ఇంటి వరకూ వచ్చినా" అన్నాడు వినయంగా.

"మంచిది. వచ్చేది హోం మినిష్టరు గదా. జర మంచిగ చూసుకోండి." అన్నాడు నర్సిరెడ్డి నవ్వుతూ చెయ్యి కలిపి, మరోసారి సెల్యూట్ చేసి జీపులో వెళ్ళిపోయాడు ఎస్.ఐ.

నర్సిరెడ్డి కూడా తయారై గ్రామ చావిడి దగ్గరకు వచ్చాడు. అప్పుడే వచ్చిన గ్రామీణ బస్సులోంచి సిద్దప్ప దిగడం చూసి దగ్గరగా వెళ్ళాడు. కొడుకు కూతురు సాయం పట్టి సరస్వతమ్మను కిందకు దింపారు. వాళ్ళ వెనుకనే నల్లయ్య కొడుకు సురేష్ కూడా సామాన్లు పట్టుకుని దిగాడు. సరస్వతమ్మ కాలు, చెయ్యి బాగుపడలేదు. మూతి వంకర కొంచెం తగ్గింది.

బండిని తోలుకు రమ్మని లచ్చమయ్యతో ఇంటికి కబురు పంపి, "ఏమన్నారు డాక్టర్లు?" అని అడిగాడు నర్సిరెడ్డి.

"పెద్ద ప్రమాదం తప్పింది పటేలు. బ్రెయిన్ హెమరేజ్ అయ్యేదట. నా అదృష్టం బాగుండి ఇక్కడితో సరిపోయింది. గావ్‌ల ఎట్లుంది?"

"పోయిందేదో పోయింది సిద్దప్పా, మీ ఇంటామెను బతికించుకుని వచ్చావు. అది చాలు."

సిద్దప్పకు అనుమానం వచ్చింది. "ఎట్లుంది నా పొలం? పనలు ఇంకా నేలమీద దొర్లాడుతున్నాయా?"

"నీకు నేను తోడున్నాను. భయపడకు సిద్దప్పా. మనకు అదృష్టం లేనప్పుడు మట్టిలోది మట్టిలో కలుస్తాది."

"ఏమయింది?"

నర్సిరెడ్డి నిజం దాచలేకపోయాడు. "ఒక్క రెండు రోజులు ముందుగా నువ్వు తిరిగొచ్చుంటే ఇలా జరిగేది కాదు. నేనైతే కుప్ప పెట్టించినా. పెద్దగా గాలివాన వచ్చి గడ్డి ఎగిరిపోయింది. పోతే పోయిందిలే. మీరు మంచిగా తిరిగొచ్చినారు, చాలు. మూడు మాసాలు ఓపిక పడితే మరో పంట చేతికొస్తుంది."

"నువ్వు బాధపడకు నాయనా నేను ఇకనుంచి ఎగుసం చూసుకుంటా" అన్నాడు రంగప్ప.

సిద్దప్ప కొడుకు మొహంలోకి ఆశ్చర్యంగా చూసాడు. అంతే ఆశ్చర్యం కలిగింది నర్సిరెడ్డికి కూడా.

"ఏమిరా అట్లా అంటావు? ఇంక ఒక సంవత్సరం చదవాలి, పరీక్షలు రాయాలి, అప్పటిగ్గాని డిగ్రీ చేతికి రాదు." అన్నాడు నర్సిరెడ్డి.

రంగప్ప తలవంచుకున్నాడు. "లేదంకుల్ నేను ఎగుసం చూస్కోవాలని డిసైడ్ చేస్కున్నా."

సురేష్ కూడా అదే మాటన్నాడు. "మా నాయన కూడా వచ్చెయ్యమంటుడు అంకుల్ వ్యాపారం చూసుకోవడాన్కి. నేగూడ అట్లనే డిసైడయినా."

నర్సిరెడ్డి ఇద్దరి భుజం మీద చెయ్యేసి మందలింపుగా చెప్పాడు. "ఉద్యమం అడ్డదార్లు పడితే మీమీద ఆధారపడే వాళ్ళ బతుకులేమౌతాయో తెలుసుకున్నారు. మీరు అంత మాత్రం తెలివిగా ఉంటే చాలు, చదువులూ మానక్కర్లే, ఉద్యమాలు మానక్కర్లే.

దేనిదారదే బిడ్డా. మీ యువత చేతులు ముడుచుకు కూర్చుంటే దేశమేమౌతాది? బాగా చదువుకోండి, మంచిగ పైకి రండి. గణేష్‌లు కాకండి.''

ఏసుపాదం బండి తీసుకొచ్చాడు. సరస్వతమ్మను బండిమీద కూర్చోబెట్టి పోనిచ్చారు. కుర్రాళ్ళు మారినారు అనుకున్నాడు నర్సిరెడ్డి.

శంకరయ్య పరుగులాంటి నడకతో వచ్చాడు.

''ఏందయ్యా గట్ల వగరుస్తున్నావు?''

''పటేల్ దొర నువ్వు జల్ది రావాల్న. యాదగిరి తల కొయ్యకేసి బాదుకుంటుండు. నేనాపలేను దొర. వాడు రక్తాలు కారి సచ్చేట్లున్నడు.''

ఎందుకు? ఏమిటి? అని అడిగే ఆలోచన మానుకుని నర్సిరెడ్డి పరుగెట్టాడు. రావి చెట్టు కింద యాదగిరి పొర్లుతున్నాడు. తలకు పెద్ద గాయమయి రక్తం కారుతోంటే తన కండువాని తీసి కట్టు కట్టాడు నర్సిరెడ్డి.

''ఏమయిందిరా యాదగిరి, గిట్ల తల బాదుకుంటివి? నీ కోసం హోం మినిష్టరొస్తున్నడు. మంచి పైసలు ముట్టచెప్తాడు. ఈ టైంల గిట్ల చేస్తే ఏం మంచిగుంటది చెప్పు.''

యాదగిరి మాట పలుకు లేకుండా ఇంటివైపు వెర్రి చూపులు చూస్తున్నాడు. నర్సిరెడ్డికి అనుమానం వచ్చి లోపలికి పోయి చూసాడు. ఎంకటమ్మ శరీరం సగం మంచానికి అడ్డంగా నేలపై వాలి ఉంది. వంటిపై చెయ్యి వేసి చూసాడు. చల్లగా ఉంది. ప్రాణం గాల్లో కలిసింది.

శంకరయ్య అందర్నీ పిలుచుకొచ్చాడు. ఎంకటమ్మ శరీరం చెట్టుకిందకు చేరింది. యాదగిరి పిచ్చి చూపులు చూస్తూ చెట్టు చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నాడు. ఎగురుతూ కొమ్మల్ని పట్టుకుని వేలాడుతున్నాడు.

ఊర్లో వాళ్ళకు పని మొదలయింది. ఎంకటమ్మ బంధువులకు కబురెళ్ళింది. దండోడాళ్ళకు కబురు తెలిసింది. కట్టెలు శ్మశానం చేరాయి. ఎంకటమ్మ కట్టెను మోసేందుకు నలుగుతు మనుషుల్ని కుదిర్చారు. నర్సిరెడ్డి దండలు, బుక్క గులాలు తెప్పించలేదు. ఆమె తల దగ్గర దీపం కూడా పెట్టలేదు.

''ఇంటి దీపం ఆరిపోయినాది, ఇంటాయనకు పిచ్చి పట్టినాది. ఇక దేనికి దీపం!'' అన్నారందరూ.

రెండు గంటల వ్యవధిలో ఎంకటమ్మ పాడెమీదకెక్కి భుజాలు మారుతూ శ్మశానం దారి పట్టింది. దండోడోళ్ళ డప్పులకు లయబద్ధంగా నాట్యం చేస్తూ తనకు తెలియకుండానే వెంటబడ్డాడు యాదగిరి.

రోడ్డు మీద హోం మినిష్టరు కాన్వాయ్ ఎదురుపడింది. మినిష్టరు, ఎం.ఎల్.ఏ, కలక్టరు, అనుచరగణాల కార్లు ఆగాయి. శ్మశానంకు అనుసరించారు అందరూ. ఎంకటమ్మ క్షణాల్లో బుగ్గి అయిపోసాగింది.

''సో.. ప్రోగ్రాం ఇవాళ కాన్సిల్ అయినట్టేగా?'' అడిగారు మినిష్టరుగారు.

''కాన్సిలే సార్. ఈ చెక్ అందుకోవడానికి ఆ ఇంటి వాళ్ళు ఎవరూ లేరిప్పుడు. తండ్రి మెంటల్ స్టేటస్ సరిగ్గా లేనప్పుడు ఈ చెక్‌ను పెండింగులో పెట్టడం తప్ప మరేం చెయ్యలేం'' అన్నారు కలక్టరుగారు.

''సాంబిరెడ్డి, నీ సంగతేమిటి?''

సాంబిరెడ్డి కాబోయే వియ్యంకుని చెవిలో గుసగుసలాడి వచ్చి చెప్పాడు, ''మా ఫంక్షను మరో రోజుకు మార్చుకుంటున్నాం సార్. ఈసారి మా ఇంటిదగ్గర తాంబూలాలు ఏర్పాట్లు చేస్తాను. పోదాం రండి.''

కార్లు పట్నం వైపు తిరిగిపోయాయి. ఊరి జనం నిశ్శబ్దంగా గ్రామం వైపు అడుగులు వేసారు. శ్మశానంలో ఉన్న పెద్ద మర్రి చెట్టు నిండా ఉన్న కాకులు గోలగోలగా అరుస్తున్నాయి. యాదగిరి వాటిపై రాళ్ళు విసురుతూ అక్కడినుండి తిరిగిరాలేదు.

**(సమాప్తం)**

Post your comments